భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 28.0

మద్ది ఆంజనేయస్వామి ఆలయ పాలక మండలి రాజీనామా

జంగారెడ్డిగూడెం, జూన్ 24 : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ కేసరి సరిత విజయభాస్కర రెడ్డితో పాటు సభ్యులు సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావుకు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.



ఎంపీలుగా ప్రమాణ స్వీకారం

భీమవరం టౌన్, జూన్ 24 : నరసాపురం లోక్‌సభ సభ్యునిగా కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పార్లమెంట్‌లో సోమ వారం ప్రమాణ స్వీకారం చేశారు. 'శ్రీనివాసవర్మ అనే నేను లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగ పట్ల నిజమైన విశ్వాసాన్ని, విధేయతను చూపుతానని, భారత దేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడుతానని, బాధ్యతతోను, శ్రద్ధాశక్తులతో త్రికరణ శుద్ధితో నిర్వహిస్తానని దైవ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను' అంటూ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు.

ఏలూరు ఎంపీగా ఆంగ్లంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న పుట్టా మహేశ్‌యాదవ్


ఎంపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న కేంద్ర మంత్రి వర్మ

వృద్ధులకు ఊరట

జూలై పింఛన్ రూ.7 వేలు

- ఇంటి వద్దకే పంపిణీ.. జిల్లాకు రూ.150 కోట్లు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మెగా డీఎస్సీ
- అన్నక్యాంటీన్ల పునరుద్ధరణకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం



(భీమవరం-ఆంధ్రజ్యోతి):

పేదవర్గాలు ఆశతో ఎదురుచూస్తున్న క్షణం రానేవచ్చింది. వచ్చే నెల 1వ తేదీన ప్రతి పేదవాడికి రూ.7 వేలు పింఛన్ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సీఎం చంద్రబాబు సంతకాలు చేసిన తొలి ఐదు పథకాలకు రాష్ట్ర కేబినెట్ చర్చించి ఆమోదముద్ర వేసింది. ప్రతీ నెలా వృద్ధులకు అందించే మూడు వేల రూపాయల పింఛన్‌ను వెయ్యి పెంచి నాలుగు వేలు అందించనుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు కూడా వెయ్యి చొప్పున పెంచి జూలైలో ఏడు వేలు అందజేస్తామని చెప్పిన విధంగానే ఇవ్వనుంది. జిల్లాలోవున్న 4 వేల 200 మంది సచివాలయ సిబ్బంది ద్వారా వీటిని ఇంటింటికి పంపిణీ చేసేందుకు కసరత్తు చేస్తోంది. జిల్లాలో రెండు లక్షల 34 వేల మంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో వృద్ధులు, వితంతువులకు రూ.నాలుగు వేలు చొప్పున ఇస్తారు. దివ్యాంగుల పింఛన్ ఆరు వేలు చేశారు. ఏప్రిల్ నుంచి పెంచిన పెన్షన్‌ను అందజేస్తారు. దీంతో ఒక్కో దివ్యాంగునికి జూన్‌లో రూ.12 వేలు అందనుంది. జిల్లావ్యాప్తంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.69 కోట్ల వరకు పెన్షన్ కోసం ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వంలో పెంచిన పెన్షన్‌తోపాటు ఏరియర్స్‌తో కలిపి రూ.150 కోట్లు ఒకే నెలలో లబ్ధిదారులకు అందించనున్నారు.

మెగా డీఎస్సీ అమలులో భాగంగా జిల్లాలోని 16 వేల 137 పోస్టులను భర్తీ చేసేందుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే జోష్ మీద వున్న బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులంతా కోచింగ్ తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా లేకపోవడంతో కోచింగ్ సెంటర్లు మూతపడ్డాయి. ఇప్పుడు మళ్లీ కోచింగ్ సెంటర్లు తెరుచుకుంటున్నాయి. జిల్లాలోని భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, పాలకొల్లులోని తొమ్మిది అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు కూడా ఆమోదముద్ర పడింది. కేవలం ఐదు రూపాయలకే మధ్యాహ్న భోజనం పెడతారు. వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతకు కారణమైన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని మంత్రి మండలి రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ చర్యతో జగన్ బొమ్మలతో వున్న పట్టాదార్ పాస్ పుస్తకాలు చిరిగిపోనున్నాయి. కొత్తపాస్ పుస్తకాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఇక మండల కేంద్రాలు, పట్టణాల్లోని యువత కోసం వృత్తి నైపుణ్య కేంద్రాల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గోదావరి డెల్టాకు 2 వేల క్యూసెక్కులు విడుదల



వాడిన ఉద్యానం

టీడీపీ హయాంలో కొనసాగిన ఆడిటోరియం భవన నిర్మాణం.. వైసీపీ ప్రభుత్వం రాకతో నిలిచిపోయింది. ఐదేళ్లుగా ఇలానే మిగిలింది.. ఒక్క అడుగు ముందుకు పడలేదు



- ఐదేళ్లుగా ఉద్యాన వర్సిటీలో అభివృద్ధి, పరిశోధనలకు దూరం
- మధ్యలోనే నిలిచిన భవన నిర్మాణాలు
- అంతంతమాత్రంగానే వర్సిటీ నిర్వహణ
- రైతులకు, విద్యార్థులకు జరగని మేలు
- అపరిశుభ్రంగా ఉద్యోగుల క్వార్టర్స్, విద్యార్థుల హాస్టల్స్ భవనాలు
- కూటమి ప్రభుత్వం రాకతో ఉద్యాన వర్సిటీకి మంచిరోజులు

రాష్ట్రంలో ఉద్యాన పంటలకు ఊతమిచ్చేందుకు, కొత్త వంగడాల రూపకల్పనకు, ఉద్యాన రంగంలో విద్యార్థులకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 2005లో తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో ఏర్పాటైంది డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయం. దీని పరిధిలో ఐదు కళాశాలలు, నాలుగు పాలిటెక్నిక్ కళాశాలలు, నాలుగు కృషి విజ్ఞాన కేంద్రాలు, 20 పరిశోధన స్థానాలు ఉన్నాయి. ఐదేళ్ల జగన్ సర్కార్ పాలనా కాలంలో దీనిని చిన్నచూపు చూడడంతో ఉద్యానాభివృద్ధి వాడిపోయింది.

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 24 : ఉద్యాన వర్సిటీలో రెండు దశాబ్దాలుగా శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి కొత్త వంగడాలు రూపొందించారు. కాని, ఐదేళ్లలో పరిశోధనలు గాడితప్పాయి. కొత్త వంగడాల రూపకల్పన లేదు. పరిశోధన ప్రాజెక్టులు తెప్పించుకోలేకపోయారు. ఐదేళ్లుగా వర్సిటీ పెద్దలు అధికార పార్టీకి వంత పాడుతూ పదవుల కోసం, అవార్డుల కోసం పాకులాడారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఐసీఏఆర్ నుంచి వచ్చే నిధులతో రైతులకు, మహిళలకు, తూతూమంత్రంగా శిక్షణలు ఇవ్వడం తప్ప వర్సిటీ స్థాయిలో నూతన వంగడాల అభివృద్ధి, కొత్త పరిశోధనలు కనిపించలేదు. వర్సిటీ అధికారులు నూతన వంగడాల విషయంలో ఎలాంటి శ్రద్ధ పెట్టలేదు. ప్రభుత్వ పెద్దల మన్ననలు పొందేందుకు, వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వారిని ప్రసన్నం చేసుకోవడంలో బిజీగా వున్నారు. ఆ ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాలను ప్రమోట్ చేయడం తప్ప, తమకు కొత్తగా ఒరిగిందేమి లేదని రైతులు బాహాటంగా విమర్శిస్తున్నారు.

నిర్వహణ శూన్యం

ఉద్యాన విశ్వ విద్యాలయం స్థాయి క్యాంపస్‌లో నిర్వహణ నీరుగారుతోంది. ఈ ప్రాంగణంలో నూతన భవనాలకు ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు. ఒక్క సెంట్రల్ లైబ్రరీ భవనం నిర్మించి రాష్ట్ర మంత్రులతో అర్భాటంగా ప్రారంభించినా మౌలిక వసతులు కల్పించకపోవడంతో నేటికి వినియోగంలోకి రాలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మూడు ఫ్లోర్‌ల ఆడిటోరియం భవన నిర్మాణం మధ్యలోనే నిలిచింది. ఐదేళ్లుగా ముందుకు కదల్లేదు. వర్శిటీ పరిధిలోని గార్డెన్స్, భవనాలు, ఉద్యోగుల క్వార్టర్స్ అంతటా నిర్వహణ లేక పాడుబడిన భవంతుల్లా తయారైంది. ఉద్యోగులు బయటకు రావాలంటేనే భయపడే విధంగా ప్రాంగణం కంపు కొడుతోంది. వర్శిటీ స్థాయిలోనే ఈ పరిస్థితి ఉంటే దీని పరిధిలోని కళాశాలల నిర్వహణ మరింత అధ్వాన్నంగా వుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బాలుర హాస్టల్ ప్రాంగణం తుప్పలు, చెత్తతో దుర్వాసన వెదజల్లుతోంది. వంగడాలు అభివృద్ధి చేసే ప్లాంట్‌ల దగ్గర నుంచి విద్యార్థుల వసతి గృహాల వరకూ తుప్పలు ఏపుగా పెరిగాయి. వసతి భవనాల్లోకి పాములు, విష పురుగులు చేరుతున్నాయని విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు.

కూటమి రాకతో పూర్వ వైభవం

టీడీపీ హయాంలో భూసేకరణతోపాటు, అప్పటి అధికారులు కొత్త ప్రాజెక్టులు తీసుకొచ్చారు. రాష్ట్ర విభజన తర్వాత గననీయంగా అభివృద్ధి సాధించింది. ఎన్నో పరిశోధనలు, కళాశాలలు అభివృద్ధి చెందాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వర్శిటీకి పూర్వ వైభవం వస్తుందని రైతులు, విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నిరుపయోగంగా మారిన ఉద్యాన వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ


బాయిస్ హాస్టల్ వద్ద అధ్వానపారిశుధ్యం..


ఉద్యోగుల క్వార్టర్స్ వద్ద ఇదే పరిస్థితి..


నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ధాన్యం సొమ్ములేవి ?

- రెండు నెలలుగా ఇవ్వకపోవడంతో రైతుల ఆందోళన.. ప్రభుత్వానికి వినతుల సమర్పణ

నరసాపురం టౌన్/పోడూరు/ఆకివీడు, జూన్ 24 : గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ములు ఇవ్వకపోడంతో రైతులు ఆందోళనలు చేపట్టారు. సోమవారం అధికారులకు వినతిపత్రాలు సమర్పించి నిధుల విడుదలకు డిమాండ్ చేశారు. ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఆర్డీవో అంబరీష్‌కు వినతిపత్రం అందించారు. ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా నేటికి సొమ్ములు ఇవ్వకపోవడం దారుణమని, ఈ కారణంగా సార్వా పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ధాన్యం సొమ్ము తక్షణం ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు, ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, కె.మాణిక్యాలరావు, కామేశ్వరరావు, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆర్బీకేల ద్వారా ధాన్యం విక్రయించి రెండు నెలలు గడుస్తున్నా సొమ్ములు విడుదల కాలేదని, త్వరగా విడుదల చేయించాలని పోడూరు మండల రైతులు తహసీల్దార్ వి.మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. సార్వాలో పెట్టుబడికి చిల్లిగవ్వ లేదని వాపోయారు.


పోడూరు తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జూలైలో విడుదలకు హామీ

గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలను జూలైలో విడుదల చేసేందుకు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు హామీ ఇచ్చారని తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపతిరాజు తిమ్మరాజు తెలిపారు. సోమవారం సిద్ధాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలు దాటినా ధాన్యం సొమ్ములు విడుదల కాకపోవడంతో రైతుల ఇబ్బందులను వారి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఒక్క ఆకివీడు మండలంలోనే రూ.22.33 కోట్ల బకాయిలు రైతులకు చెల్లించాల్సి ఉందన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నౌకట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.


ప్లీజ్.. పార్టీని వీడొద్దు

- ప్రజా ప్రతినిధులకు వైసీపీ బుజ్జగింపు


నరసాపురం, జూన్ 24: ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చెందడంతో చాలామంది స్థానిక ప్రజా ప్రతినిధులు పార్టీ వీడుతున్నారన్న ఊహాగానాలు షికారు చేయడంతో ఆ పార్టీ ముఖ్య నేతలు అలర్ట్ అయ్యారు. ఫలితాలు తరువాత స్తబ్దతగా ఉన్న కొందరికి ఫోన్ చేసి మంతనాలు జరిపినట్లు తెలియవచ్చింది. ఇప్పటికే కొందరు కౌన్సిలర్లు స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలతో వైసీపీ పెద్దలు ఐదు రోజుల క్రితం సమావేశమయ్యారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమిలు సహజమని, రానున్న రోజుల్లో పార్టీకి మంచి రోజులు ఉంటాయని, కేడర్‌కు ఈ సారి గుర్తింపు ఇస్తారంటూ బుజ్జగించే ప్రయత్నాలు చేశారు. అయితే ఈ సమావేశానికి ముగ్గురు కౌన్సిలర్లు డుమ్మా కొట్టినట్లు తెలిసింది. నరసాపురం పట్టణంలో బుధ, గురువారాల్లో వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశానికి సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో ఎవరు ఉంటారో.. ఎవరూ వెళతారన్నది ఆసక్తికరంగా మారింది.

అండర్‌పాస్ నిర్మాణానికి మట్టి పరీక్షలు

ఆకివీడు, జూన్ 24 : సిద్ధాపురం వైపు, గుమ్ములూరు వైపు వెళ్లే రైల్వే గేట్ల వద్ద అండర్ పాస్ నిర్మాణానికి మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు సివిల్ ఇంజనీర్ ప్రకాశ్ సోమవారం తెలిపారు. రెండు రోజుల నుంచి మట్టి తవ్వుతున్నామని, ఒక్కో గేటు వద్ద మూడు, నాలుగు రోజులు మట్టిని తవ్వి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఈ రెండుచోట్ల అండర్‌పాస్ నిర్మాణాలు జరిగితే స్థానికులు, ప్రయాణికుల సమస్య పరిష్కారమవుతుంది.



పోలవరానికి అంతర్జాతీయ నిపుణులు



18 రైళ్ల రద్దు.. ఆరు పునరుద్ధరణ



ఉపాధి హామీ పథకంలో అక్రమాలు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు

86 అర్జీలు

- నాణ్యమైన పరిష్కారం అందించాలి: డీఆర్వో

భీమవరం టౌన్, జూన్ 24 : ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజల ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని డీఆర్వో జె.ఉదయభాస్కరరావు అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన తొలి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో 86 ఫిర్యాదులు వచ్చాయి. డీఆర్వోతోపాటు కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టరు బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలపై వచ్చిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల్లో కొన్ని.. 'తన కుమారుడు అడ్డగర్ల సంజీవ్ వ్యవసాయ భూమిని అనుకుని వున్న పంట బోదె గట్టున ఏడేళ్ల క్రితం కొబ్బరి, ఇతర మొక్కలను పెంచుకుంటున్నాడు. కొందరు వ్యక్తులు వాటిని తొలగించారు. వారిపై చర్యలు తీసుకుని మొక్కలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాల'ని ఇరగవరం మండలం తూర్పువిప్పర్రుకు చెందిన అడ్డగర్ల వేంకటేశ్వరరావు కోరారు. 'మాది నిరుపేద కుటుంబం. ప్రమాదవశాత్తు చెయ్యి విరిగింది. దివ్యాంగుల పెన్షన్ మంజూరుచేసి మా కుటుంబానికి న్యాయం చేయాలి' అని భీమవరం మండలం దెయ్యాలతిప్పకు చెందిన మోకా పార్వతి కోరారు. 'ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి ధాన్యం విక్రయించాను. ఇప్పటి వరకు సొమ్ములు రాలేదు. తక్షణం వాటిని మంజూరు చేయించండి' అంటూ ఉండి మండలం యండగండికి చెందిన పి.వెంకట సత్యగోపాలకృష్ణంరాజు కోరారు. 'నా పంట భూమికి ఆన్‌లైన్‌లో వేరే వారి పాస్ బుక్ చూపిస్తోంది. సరి చేయించాలి' అని ఎస్ఆర్‌పి అగ్రహారానికి చెందిన వీరవల్లి సాయిరామ్ కోరారు 'నాకు 82 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. పక్క రైతులు రొయ్యల చెరువులు తవ్వి ఉప్పు నీరు పెట్టడంతో నా పంట భూమి నాశనమవుతోంది' అని పెంటపాడు మండలం రావిపాడుకు చెందిన వంగూరి ధనరాజు తెలిపారు. 'భీమవరం ఏడో వార్డులో మంచినీటి, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలి' అని దుర్గ అనే మహిళ ఫిర్యాదు చేసింది.


కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్వో


అర్జీలు సమర్పించేందుకు వచ్చిన మహిళలు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ వి.అజిత

చట్ట ప్రకారం పరిష్కరించండి : ఎస్పీ అజిత

భీమవరం క్రైం, జూన్ 24 : చట్ట ప్రకారం ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.అజిత అధికారులను ఆదేశించారు. పశ్చిమ గోదావరి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ అజిత ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వారితో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఏఎస్పీ వి.భీమారావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

18 రైళ్ల రద్దు..ఆరు పునరుద్ధరణ

ఏలూరు క్రైం, జూన్ 24 : దక్షిణ మధ్య నిడదవోలు- కడియం సెక్షన్ల పరిధిలో ట్రాఫిక్ మెయింటినెన్స్ పనుల దృష్ట్యా 18 రైళ్లను సోమవారం నుంచి ఆగస్టు 10వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రద్దు చేసిన ఆరు రైళ్ళను తిరిగి పునరుద్ధరిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.



పునరుద్ధరించిన రైళ్లు

17257 విజయవాడ - కాకినాడ
17258 కాకినాడ పోర్టు- విజయవాడ
12806 లింగంపల్లి-విశాఖపట్టణం
ఈనెల 26 నుంచి పునరుద్ధరణ
12805 విశాఖపట్టణం -లింగంపల్లి ఈనెల 25 నుంచి..
17643 చంగల్‌పట్టు - కాకినాడ పోర్టు ఈనెల 25 నుంచి..
17644 కాకినాడ పోర్టు - చంగల్‌పట్టు ఈనెల 26 నుంచి..

రద్దయిన రైళ్లు

07466 రాజమండ్రి - విశాఖపట్టణం ఈనెల 24 నుంచి ఆగస్టు 10 వరకూ
07467 విశాఖపట్టణం - రాజమండ్రి 24 నుంచి ఆగస్టు 10 వరకూ
17219 మచిలీపట్టణం - విశాఖపట్టణం 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17220 విశాఖపట్టణం - మచిలీపట్టణం 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17249 తిరుపతి - కాకినాడ టౌన్ 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17250 కాకినాడ టౌన్ - తిరుపతి 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17239 గుంటూరు - విశాఖపట్టణం 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17240 విశాఖపట్టణం - గుంటూరు 24 నుంచి ఆగస్టు 11 వరకూ
17243 గుంటూరు - రాయగడ 23 నుంచి ఆగస్టు 10 వరకూ
17244 రాయగడ - గుంటూరు 24 నుంచి ఆగస్టు 11 వరకూ
12718 విజయవాడ - విశాఖపట్టణం 24 నుంచి ఆగస్టు 10 వరకూ
12717 విశాఖపట్టణం- విజయవాడ 24 నుంచి ఆగస్టు 10 వరకూ
22702గుంటూరు-విశాఖ (సోమ,మంగళ) 24 నుంచి ఆగస్టు 10 వరకూ
22701 విశాఖ- గుంటూరు (బుధ,శుక్ర, శని) 24 నుంచి ఆగస్టు 10 వరకూ
12776 లింగంపల్లి -కాకినాడ(సోమ, బుధ, శుక్ర) 24 నుంచి ఆగస్టు 9 వరకూ
12775 కాకినాడ- లింగంపల్లి (మంగళ,గురు,ఆది) 23 నుంచి ఆగస్టు 8 వరకూ
22708 తిరుపతి-విశాఖపట్టణం (బుధ, శుక్ర,ఆది)23 నుంచి ఆగస్టు 9 వరకూ
22707విశాఖపట్టణం-తిరుపతి (సోమ,గురు,శని)24 నుంచి ఆగస్టు 10 వరకూ

సీలేరు నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు, జూన్ 24: ఖరీఫ్ పంటలు, తాగు నీటి అవసరాల కోసం గోదావరి డెల్టాకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు ఏపీ జెన్‌కో ఎస్‌ఈ కేకేవీ ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి జలాశయం నుంచి జెన్‌కో అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ జలవనరుల శాఖ అధికారుల అభ్యర్థన మేరకు సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి నుంచి రెండు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశామన్నారు. అలాగే పవర్ కెనాల్ ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామన్నారు.ఈ మేరకు గోదావరి డెల్టాకు ఆరు వేల క్యూసెక్కుల నీరు వెళుతుందని ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు నీటిని విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 12.5 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు.

ప్రైవేట్ లైన్‌మేన్ మృతిపై విచారణ

'ఆంధ్రజ్యోతి' కథనంతో ఈపీడీసీఎల్ సీరియస్

నరసాపురం, జూన్ 24: ప్రైవేట్ లైన్‌మేన్ షణ్ముకం మృతిపై విచారణకు ఈపీడీసీఎల్ స్పందించింది. రెండు రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన విచారణ చేయిస్తారా? అన్న కథనంపై ప్రభుత్వం సీరియస్ అయింది. దీనిపై విచారణ చేయించాలని ఆదేశించడంతో ఈపీడీసీఎల్ ఉన్నతస్థాయి విచారణ చేపట్టింది. ఒక ఈఈ స్థాయి అధికారిని విచారణ అధికారిగా నియమించారు. విశాఖ నుంచి మరో ఉన్నతాధికారి బృందం కూడా సోమవారం నరసాపురం సబ్ డివిజన్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ప్రమాదంపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. సిబ్బందిని ఆరా తీస్తున్నారు. మరోవైపు ప్రమాదం జరిగిన తరువాత విషయాన్ని ఈపీడీసీఎల్ ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదన్న దానిపై కూడా ఆరా తీస్తున్నారు. కనీసం మృతి చెందిన తరువాత పోలీసులు కేసు కట్టిన విషయాన్ని కూడా గోప్యంగా ఉంచడంపై ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగా బాధ్యుల్ని కాపాడారన్న వాదనలు వినిపిస్తుండంతో దీనిపై లోతైన విచారణ చేస్తున్నారు. విచారణకు సంబంధించిన విషయాలను అధికారులు వెల్లడించలేదు. ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.



అతిసార వ్యాధి నిర్మూలన సూచనల పోస్టర్ ఆవిష్కరించిన డీఆర్‌వో

అంటువ్యాధులు ప్రబలకుండా అవగాహన కల్పించాలి

భీమవరం: జూన్ 24 : అతిసార వ్యాధి నిర్మూలన సూచనల గోడ ప్రతులను జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతిసార వ్యాధి, డెంగీ, తదితర అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది విస్తృతంగా గ్రామాల్లో వార్డులలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే నెల 1 తేదీ నుంచి ఆగస్టు 30 వరకు డయేరియా నియంత్రణపై ప్రచార కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం తీసుకుని ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ, జిల్లా అభివృద్ధి అధికారి అప్పారావు, జిల్లా పంచాయతీశాఖ అధికారి ఆర్.విక్టర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవ సుధాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

27న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరుసిటీ, జూన్ 24: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 27న జరుగుతాయని జిల్లా ప్రజా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఏలూరు జిల్లా ప్రజా పరిషత్‌లోని ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో సమావేశాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు

ఇంజనీరింగ్ కళాశాలల రాష్ట్ర కోశాధికారిగా గ్రంధి



తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 24: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు కళాశాలల మేనేజ్ మెంట్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారిగా తాడేపల్లిగూడెం వాసవీ ఇంజ నీరింగ్ కళాశాల పాలక మండలి అధ్యక్షుడు గ్రంధి సత్య నారాయణ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు వాసవీ కళాశాల పాలకవర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ రత్నాకర రావు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మస్తర్లలో..మాయాజాలం

జాతీయ ఉపాధిహామీ పథకంలో అక్రమాలు
బినామీ పేర్లతో మస్తర్లు
మేత మేస్తున్న మేట్లు
పట్టించుకోని అధికారులు

ద్వారకాతిరుమల/ అత్తిలి జూన్ 24: ఉపాధిహామీ పథకం అధికారులు, పాలకుల చేతుల్లో చిక్కి సక్రమంగా పనులు చేపట్టకపోవడంతో పక్కదారి పడుతోంది. ఏటా నిధులు పక్కదారి పడుతున్నాయని సామాజిక తనిఖీల్లో వెల్లడవుతున్నా లక్షల్లో అక్రమాలు జరిగితే వేలల్లో జరిమానాలు విధించి సరిపెడుతున్నారు. అధికారులపై చర్యలు లేకపోవడం క్షేత్రస్థాయి సిబ్బంది రాజకీయ పలుకుబడితో అక్రమాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటంతో పథకం ఉద్దేశం పక్కదారి పడుతోంది. అవినీతిపరులైన కొందరు మేట్లు స్థానికంగా నివాసం ఉండని వారికి, ప్రైవేటు కంపెనీల్లో, పంచాయతీల్లో పనిచేసే వారికి మస్తర్లు వేసేస్తున్నారు. నేతల ఒత్తిళ్ల మేరకు వారి కుటుంబసభ్యుల పేరుతో జాబ్‌కార్డులు ఇచ్చి పనులకు రాకపోయినా వస్తున్నట్లు మస్తర్లు వేస్తున్నారు.బోగస్ మస్తర్లు వేస్తూ కూలీలు రాకపోయినా మేట్లు హెచ్చు మొత్తంలో సొమ్ము డ్రా చేసుకుని వచ్చిన కూలీలకు ఏదో కొంత ముట్టచెప్పి మిగిలినది దండుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ద్వారకాతిరుమల మండలంలో 16,874 జాబ్ కార్డులున్నాయి. సుమారుగా 27 వేల మంది వరకూ కూలీలున్నారు. వీరిలో కేవలం పదివేల మందిలోపే పనుల్లోకి వస్తున్నారు. మండలంలోని ఐఎస్ జగన్నాథపురం, గుణ్ణంపల్లి, తిరుమలంపాలెం, నారాయణపురం, బుట్టాయిగూడెం, పంగిడి గూడెం తదితర గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వం తాజాగా కూలీల ఫొటోల అప్‌లోడ్ విధానాన్ని ప్రవేశ పెట్టినా దానివల్ల ప్రయోజనం పెద్దగా కన్పించడం లేదు.



తిరుమలంపాలెంలో 20వ తేదీ నుంచి మస్తరు వేయాల్సి ఉండగా ఖాళీగా కన్పిస్తున్న అటెండెన్స్ షీట్

● అత్తిలి మండలంలో పది వేలకు పైగా జాబ్ కార్డులు ఉన్నప్పటికీ కేవలం 8 వేల మందికే పని కల్పిస్తున్నట్లుగా చూపిస్తున్నారు. ఇతర కుటుంబాలు లక్ష్యానికి దరిదాపుల్లోనే లేవు. ఇందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంది. పని కల్పించలేని పరిస్థితులు ఎదురైతే పరిహారం చెల్లించే నిబంధన చట్టంలో ఉంది. అధికారులు, పాలకుల తప్పిదం వల్లే కొంతమందికే ఉపాధి హామీ పనులకు అవకాశం ఉంటున్నది. కుటుంబానికి ఒక్కటే జాబ్‌కార్డు పద్ధతి అమలులో ఉంది. వీటిని కొందరు క్షేత్ర సహాయకులు దుర్వినియోగం చేస్తున్నారు. నేతలకు, అయినవారికి అదనంగా మరో కార్డు సృష్టిస్తున్నారు.పని చేయకున్నా కూలీలుగా నమోదు చేయించి సొమ్ములు జమ చేస్తున్నారు. ఐదేళ్లలో గ్రామ సభలు నామమాత్రంగా మారాయి. నేతలు చెప్పిన పనులే జరిగాయి. సభల నిర్వహణ సమయంలో ఫిర్యాదులు ఉన్నా పట్టించుకోలేదు. ఎంతోకొంత రికవరీ చూపించడం, తప్పులు మాఫీ చేయించుకోవడం నేర్చుకున్నారు.

బోగస్ మస్తర్లతో సొమ్ము లూటీ

ప్రస్తుతం ఉపాధి పనుల తీరును చూస్తే విస్తుబోయే పరిస్థితి ఏర్పడింది. రోజువారీ కూలీల లక్ష్యం కంటే తక్కువగా వస్తున్నా బోగస్ మస్తర్లు వేసి ఎక్కువ మంది వచ్చినట్లు చూపుతున్నారు. అంతేకాకుండా చేసిన పనికంటే ఎక్కువ చూపుతూ కూలీల నుంచి సొమ్ము వసూళ్లకు తెగ బడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు మేట్లు వారికి కేటాయించిన అడెండెన్స్ షీట్లలో మస్తర్లను వేయడం లేదు.వారానికోసారి నమోదు చేస్తున్నారు. అదేంటని అడిగితే తమకు ఆలస్యంగా ఇచ్చారంటూ సాకులు చెబుతున్నారు. పలుచోట్ల పనికి వచ్చినవారికి హాజరు వేసి రానివారికి ఆబ్సెంట్ వేయకుండా ఖాళీగా ఉంచుతున్నారు. ఆనక బినామీ పేర్లతో మస్తర్లు వేసుకుని సొమ్ములు దండుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒక కుటుంబంలో కొందరు పనికి వచ్చి కొందరు రాకుంటే రానివారికి కూడా మస్తరు వేసి వారి నుంచి సొమ్ము వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో కిందిస్థాయిలో అవినీతి మరింతగా పెరిగిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మస్తర్ల తనిఖీలు ఎక్కడ

క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీల హాజరు సమయంలో సామూహికంగా చిత్రాలు తీస్తున్నారు. దీనికి జియో టాగ్ చేస్తున్నారు. ఇంత చేస్తున్నా పారదర్శకత కరువైంది. ఎంత మంది కూలీలు ఉన్నారు, వారి హాజరు, నమోదు వివరాలు క్షుణ్ణంగా పరిశీలన చేయడం లేదు. తక్కువ మంది పని చేస్తున్నా ఎక్కువ మంది హాజరు వేసి క్షేత్రస్థాయిలో నిధులు స్వాహా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఎపీడీ, ఎంపీడీవో, ఎపీఎల్ తనిఖీల్లో డొల్లతనం బయట పెట్టడం లేదని కూలీలు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా ఉపాధిహామీ పథకంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మేట్లను అడ్డుపెట్టుకుని క్షేత్రసహాయకులు అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజూ పని ప్రాంతంలో మస్తర్లు వేయాల్సిన మేట్లు వారం చివరిలో ఒక రోజు వేయడం అందుకు నిదర్శనం. గతంలో సహాయకులు కొలతలు ఇచ్చి కూలీలకు మస్తర్లు వేసేవారు. రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 50 జాబ్‌కార్డులకు ఒక మేటుని నియమించారు.వారే రోజూ కూలీలను తీసుకువచ్చి కొలతలు ఇప్పించి పనిచేయించాలి. మస్తర్లు కూడా వేయాలి. అనంతరం ఫోన్‌లో కూలీల ఫోటోలను అప్‌లోడ్ చేయాలి.



ద్వారకాతిరుమల మండలం బుట్టాయిగూడెంలో ఉపాధిపనులు

శ్రమ దోపిడీ జరుగుతోందిలా :

ఉపాధిహామీ కూలీలు నిర్దిష్ట కొలతల ప్రకారం పని పూర్తి చేస్తేనే దానికి అనుగుణంగా కూలీ డబ్బులు వస్తాయి. లేదంటే తగ్గిపోతాయి. అయితే పనికి రాని వారి పేర్ల మీద మస్తరు వేయడం ద్వారా శ్రమదోపిడీ జరుగుతుంది. వాస్తవంగా పని చేసిన కూలీలకు డబ్బులు తక్కువగా వస్తున్నాయి. పలు గ్రామాల్లో వారానికి కూలీ డబ్బులు 1500 కూడా రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనికి రాని వారికి మస్తర్లు వేసి పనిచేసిన కూలీలకు తక్కువ డబ్బులు ఇవ్వడం ద్వారా శ్రమ దోపిడీ జరుగు తోందని ఆరోపిస్తున్నారు. అసలు గ్రామాల్లో లేనివారికి కూడా మస్తర్లు వేయడం వారి నుంచి సొమ్ములు వసూలు చేయడం జరుగు తోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు.

● డ్వామా పీడీ రాము మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరించే కిందస్థాయి వారిపై కఠిన చర్యలు తీసు కుంటామన్నారు. ద్వారకా తిరుమల ఏపీవో హేమంత్ మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు ఉన్న గ్రామాల్లో విచారణ చేపడతామని, అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు ఉంటాయన్నారు.

డీసీసీబీకి గట్టి పోటీ

చైర్మన్ పదవి ఆశిస్తున్న కూటమి నాయకులు

భీమవరం-ఆంధ్రజ్యోతి, జూన్, 24: కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ పదవి కోసం గట్టి పోటీ నెలకొంది. కూటమి గెలుపుకోసం శ్రమించిన నాయకులు డీసీసీబీ చైర్మన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగుదేశం జనసేన పార్టీ నుంచి ఆశావహులు అధికంగా ఉన్నారు. పార్టీలో సీనియర్లు అంతా ఇప్పటికే అధిష్టానాలకు సంకేతాలు పంపారు. ఏడాది పాటు సహకార సంఘాలతో పాటూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకులోనూ చైర్మన్ పదవులకు నామినేటెడ్‌గా భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తున్నది. తక్షణమే ఎన్నికలు నిర్వహించకుండా తదుపరి కసరత్తు చేయాలని యోచిస్తున్నారు. దీంతో ఆశావహులు అధికంగా ఉన్నారు. మెట్టప్రాంతం నుంచి కరాటం రాంబాబు పేరు వినిపిస్తున్నది. గతంలో ఆయన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా వ్యవహరించారు. పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఆశావాహుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తుంది. తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కోల నాగేశ్వరరావు ఈ పదవిని ఆశిస్తున్నారు. తెలుగుదేశం కూడా ఆయనకు ఏదో ఒక పదవి ఇవ్వాలన్న తలంపుతో ఉంది. దాంతో డీసీసీబీ పైనే ఆయన ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. జిల్లా నేతలతోనూ సంప్రదింపులు చేస్తున్నారు. మరోవైపు మెంటే పార్థసారధి కూడా రేసులో ఉన్నారు. గతంలో ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. పార్టీలోనూ రాష్ట్రస్థాయి పదవులను చేపట్టారు. మరోవైపు నర్సాపురం నియోజవర్గానికి చెందిన కలవకొలను తాతాజీ పేరుకూడా వినిపిస్తున్నది. గడిచిన 30 ఏళ్ళుగా సహకార రంగంపై ఆయనకు అనుభవం ఉంది. జనసేన పార్టీలో ఆయన కొనసాగుతున్నారు. తాతాజీ పేరుకూడా డీసీసీబీ రేసులో ప్రముఖంగా వినిపిస్తున్నది. వాస్తవానికి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో సహకార సంఘం దారుణంగా దెబ్బతింది. ఐదేళ్ల పాటు ఎన్నికలు నిర్వహించలేదు. పార్టీ నాయకులు, శ్రేణులతోనే త్రిసభ్య కమిటీని నియమించారు. దాంతో సహకార వ్యవస్థ గాడి తప్పింది. సొసైటీలు అన్నీ నష్టాలలో కూరుకుపోయాయి. ప్రభుత్వం నుంచి ధాన్యం కమీషన్ సొమ్ములు కూడా రాలేదు. కోట్లాది రూపాయిలు బకాయి పడింది. త్రిసభ్య కమిటీలు సైతం ప్రశ్నించే పరిస్థితి లేదు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కూడా నష్టాలలో నడుస్తుంది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించింది. కూటమి ప్రభుత్వంలో అయినా సహకార సంస్థ గాడిలో పడుతుందని ఆశిస్తున్నారు. అయితే ఏడాది వరకూ ఎన్నికలు లేకుండానే తక్షణం నామినేటెడ్ ద్వారా సహకార వ్యవస్థలో చైర్మన్ పదవులను భర్తీ చేయాలని కూటమి ప్రభుత్వం కూడా కసరత్తు చేస్తుంది. దాంతో జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ పదవి కోసం కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

పోలవరానికి అంతర్జాతీయ నిపుణులు

27న రాష్ట్రానికి రానున్న అమెరికా, కెనడా ఇంజనీర్లు
ఏడాదిపాటు సేవలకు ఒప్పందం
కేంద్రం, పోలవరం అథారిటీ విజ్ఞప్తితో డ్యాం భద్రత పరిశీలన



నిపుణుల బృందానికి 30 ఏళ్ల అనుభవం

పోలవరం, జూన్ 24 : పోలవరం సాగునీటి ప్రాజెక్టు పనులను అంతర్జాతీయ నిపుణుల బృందం పరిశీలించనుంది. కేంద్ర జలశక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ విజ్ఞప్తి మేరకు ఈ ప్రాజెక్టు పరిశీలనకు అమెరికా, కెనడా దేశాలకు చెందిన నలుగురు ఇంజనీరింగ్ నిపుణుల బృందం ఈ నెల 27న రాష్ట్రానికి రానుంది. ఈ బృందానికి డ్యాం నిర్వహణ, భద్రత, సివిల్ ఇంజనీరింగ్, హైడ్రాలిక్ నిర్మాణాలు, కట్టడాలకు సంబంధించిన అంశాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉంది. విదేశీ బృందంలో ఇంజనీర్లు డేవిడ్ బి.పాల్ (అమెరికా), రిచర్డ్ డొన్నెల్లీ(కెనడా), డియాన్ ఫ్రాన్స్ డి.సిక్కో(అమెరికా), సీన్ హిచ్‌బర్గర్(కెనడా) ఉన్నారు. ఈ బృందం ఈ నెల 27 నుంచి జూలై 5 వరకు తొమ్మిది రోజులపాటు పోలవరం ప్రాజెక్టులో మకాం వేసి మరీ ప్రాజెక్టు నిర్మాణంలో ఈసీఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణానికి సవాలుగా ఉన్న డయాఫ్రంవాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంల సీపేజీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇతర ప్రతిబంధక సమస్యల అంశాలను పరిశీలించనుంది. అనంతరం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి నివేదికలు సమర్పించనుంది. ప్రాజెక్టు నిర్మాణంలో కటాఫ్ వాల్‌గా నదీ గర్భంలో నిర్మించిన డయాఫ్రంవాల్ 2020లో సంభవించిన వరదలకు కొంతమేర దెబ్బ తినడంతో దానికి సమాంతరంగా మరో డయాఫ్రంవాల్ నిర్మించాలని రాష్ట్ర జల వనరుల శాఖ ప్రతిపాదించింది. దీనిపై ఈ బృందం అధ్యయనం చేసి అభిప్రాయాన్ని వెల్లడించనుంది. గతంలో జరిగిన అధ్యయనాలు.. ఎగువ కాఫర్ డ్యాం నుంచి అధికంగా వెలువడుతున్న సీపేజీ అరికట్టడానికి రసాయనిక జెట్ గ్రౌటింగ్ ప్రక్రియ, సీపేజీ జలాల తీవ్రత తెలియజేసే పీజియో మీటర్లు ఏర్పాటు చేయడం వంటి వాటి విషయంలో కొన్ని సూచనలు చేశాయి. ఆ సూచనలు ఎంతమేరకు పని చేస్తాయో కూడా ఈ బృందం పరిశీస్తుంది. ఎగువ కాఫర్ డ్యాం సీపేజీ అరికట్టడానికి, డయాఫ్రంవాల్ నిర్మాణం విషయంలో ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలో ఈ బృందం నివేదికను అందిస్తుంది. నదీ గర్భం కోతను పూడ్చేందుకు వైబ్రో కాంపాక్షన్, వైబ్రో స్టోన్ కాలమ్‌ల ఏర్పాటు అంశాలపై కూడా ఈ బృందం అధ్యయనం చేసి తక్కువ ఖర్చుతో ప్రత్యా మ్నాయ మార్గాలను చూపవలసి ఉంటుంది. పోలవరం ప్రాజెక్టు అథార్టీల సిఫారసు మేరకు నియమించిన ఈ బృందం ప్రతి మూడు నెలలకు ఒకసారి పోలవరం ప్రాజెక్టును పరిశీలించి సాంకేతిక సలహాలు సూచనలు చేయనుంది. ఈ బృందం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యే వరకు ఇంజనీరింగ్ సిబ్బందికి, అధికారులకు సాంకేతిక సలహాలు, సూచనలు అందించనుంది.

మూడు దశాబ్దాల అనుభవం

అంతర్జాతీయ బృందంలో ఉన్న వారికి మూడు దశాబ్దాల అనుభవం ఉంది. డ్యాం భద్రత, మౌలిక వసతుల నిర్వహణలో అమెరికాకి చెందిన అంతర్జాతీయ డ్యాం భద్రతా సీనియర్ కన్సల్‌టెంట్ డేవిడ్ బి.పాల్‌కు 30 ఏళ్ల అనుభవం ఉంది. హైడ్రాలిక్ నిర్మాణాలు నీటి వనరుల నిర్వహణలో కెనడాకి చెందిన రిచర్డ్ డొన్నెల్లీకి కూడా మూడు దశాబ్దాల అనుభవం ఉంది. అమెరికాలోని ఫ్లోరిడా నగరానికి చెందిన గియాస్ ఫ్రాంకో డి.సిస్కోకి భారీ డ్యాంల నిర్మాణం, నిర్వహణ, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ సొల్యూషన్స్‌లో 28 ఏళ్ల అనుభవం సొంతం. ఇక, కెనడాకు చెందిన జియో టెక్నికల్ కన్సల్టెంట్ సీన్ హించ్ బెర్గర్‌కు జియో టెక్నికల్ ఇంజనీరింగ్ నీటిపారుదల నిర్వహణలో 25 ఏళ్ల అనుభవం ఉంది.

మేలోనే గుర్తింపు

అంతర్జాతీయ నిపుణులను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఈ ఏడాది మే నెలలోనే గుర్తించి వారి వివరాలను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపింది. వీరిని అప్పుడే నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వవలసి ఉంది.అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అంతర్జాతీయ నిపుణులకు నియామకపత్రాలను ఇవ్వలేదు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ ముగియడం కేంద్ర జలశక్తి మంత్రిగా పాటిల్ బాధ్యతలు స్వీకరించడంతో అంతర్జాతీయ నిపుణులను నియమించారు. ఈ నిపుణులు ఈ నెల 27వ తేదీ నుంచి పోలవరం సాగునీటి ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటిస్తారు. 29న ఢిల్లీ నుంచి జలశక్తి మంత్రిత్వశాఖ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహిస్తారు.ఈ నిపుణుల బృందం ఏడాది పాటు సేవలు అందించేలా పీపీఏ ఒప్పందం చేసుకుంది.

క్రైం కార్నర్

కాలువలో మునిగి వృద్ధుడి మృతి

పెంటపాడు, జూన్ 24 : గేదె కోసం వెళుతూ మురుకుకాలువలో పడి వృద్ధుడు మృతి చెందాడు. గణపవరం మండలం కాశిపాడు గ్రామానికి చెందిన గూడపాటి రత్నంరాజు (69) సోమవారం ఉదయం గేదెను మేపేందుకు బోడపాడు మురుగుకాలువ సమీపానికి వచ్చాడు. గేదె తప్పించుకుని కాల్వలో దిగడంతో గేదెను పట్టుకునే క్రమంలో వృద్ధుడు కాలువలో మునిగి మృతిచెందాడు. పెంటపాడు ఎస్‌ఐ శీలం శంకర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుని కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామచంద్రపురంలో చోరీ

రెండు కాసుల బంగారు తాడు, రూ.20 వేలు అపహరణ



పరిశీలిస్తున్న క్లూస్‌టీం

పెదపాడు, జూన్ 24 : పెదపాడు శివారు రామచంద్రపురంలో ఇంటి తాళాలు పగులకొట్టి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన ఘటనపై పెదపాడు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రామచంద్రపురానికి చెందిన దొగ్గా సరోజనికి ఇద్దరు కుమారులు కాగా, వీరు ఉద్యోగాల రీత్యా వేరే ప్రాంతాల్లో నివాసముంటున్నారు. సరోజని ఒంటరిగా నివాసముంటూ కొన్నిరోజుల క్రితం సమీపంలోనే ఉండే కుమార్తె ఇంటికి వెళ్లింది. విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న చిన్న కుమారుడు రాజు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటికి రాగా అప్పటికే తలుపులు తెరిచి ఉండ టంతో లోపలకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లుగా గుర్తించి పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్‌టీం సంఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. ఘటనలో రెండు కాసుల బంగారు తాడుతో పాటుగా రూ.20 వేలు నగదు పోయినట్టుగా ఫిర్యాదులో పేర్కొ న్నారు. పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలు సీజ్



పెదపాడు, జూన్ 24 :పెదపాడు, పరిసర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీలు నిర్వహిస్తుండగా చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోడి వ్యర్థాలను తరలిస్తున్న రెండు వాహనాలను పెదపాడు పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రెండు వాహనాలకు సంబంధించి వాహన యజమాని, డ్రైవర్లు, చెరువు యజమానులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కోళ్ల వ్యర్థాలను గొయ్యితీసి పూడ్చి పెడతామని ఎస్సై చెప్పారు.

జనసేన సభ్యుడిపై వైసీపీ కార్యకర్తల దాడి



గాయాలతో బాధితుడు పవన్

ద్వారకాతిరుమల, జూన్ 24: జనసేన పార్టీలో పనిచేస్తున్నాడన్న కక్షతో ఆ పార్టీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి దాడికి తెగబడ్డారు. మద్యం సీసాతో దాడి చేసి గాయపర్చినట్లు బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలోని పంగిడిగూడేనికి చెందిన తైదుల పవన్‌కుమార్ స్థానికంగా కిరాణా షాపు నిర్వహించుకుంటూ జనసేన పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్నాడు.ఆదివారం రాత్రి 9 గంటలు దాటిన తర్వాత గ్రామంలోని ఓ మార్ట్‌కు సరుకుల నిమిత్తం వెళ్తున్నాడు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన 13వ వార్డు సభ్యుడు చోడే శేఖర్, అతని మేనల్లుడు ఏసు పవన్ బైక్‌ను ఆపి వారి చేతిలో ఉన్న మద్యం సీసాతో దాడి చేశారు. "మొన్న టీడీపీ వాడు కాలి అశోక్‌ను కొట్టాం..ఏం చేయలేకపోయాడు..ఇప్పుడు నిన్ను కొడతాం.. ఏం చేస్తారురా" అంటూ దౌర్జన్యం చేసినట్లు బాధితుడు తెలిపాడు. శేఖర్ వైసీపీ నాయకుడు గుమ్మడి శ్రీను వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని తనకు వైసీపీ నాయకుల నుంచి ప్రాణభయం ఉందని పవన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

సరిహద్దు తగాదా..భార్యాభర్తలపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూన్ 24 : మండలంలోని మంగిశెట్టిగూడెంలో ఓ మహిళపై దాడి చేసి గాయపరచిన ఘటనలో భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాసు తెలిపారు. మంగిశెట్టిగూడెం గ్రామానికి చెందిన గోపిశెట్టి కనకదుర్గ బ్యూటీ పార్లర్ నడుపుతూ జీవిస్తున్నది. సరిహద్దు తగాదాలపై ఆమె ఇంటి పక్కనే ఉన్న నల్లగోపు చిరంజీవి, అతని భార్య శివపార్వతిలపై తన తల్లిని కొట్టారని కనకదుర్గ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. ఇదిలా ఉండగా సోమవారం ఉదయం కనకదుర్గ ఇంటి వద్ద చిరంజీవి భార్య చెత్త వేయడంతో కనకదుర్గ ప్రశ్నించింది.దీంతో చిరంజీవి, శివ పార్వతి కలిసి కనకదుర్గను కింద పడవేసి కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఆసుపత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు సీఐ రాజేష్, ఎస్సై బాధితురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకుని కేసు నమోదు చేశారు.

మాజీ వలంటీర్ ఆత్మహత్యాయత్నం

జంగారెడ్డిగూడెం, జూన్ 24 : ఆర్థిక ఇబ్బందులతో మాజీ వలంటీర్ పఠాన్ నగీనా చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం జంగారెడ్డిగూడెం పట్టణంలో జరిగింది. కుటంబ సభ్యులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం నుంచి బయట పడింది. వలంటీర్ తల్లి విలేకరులతో మాట్లాడుతూ తన కుమార్తె తూర్పు గోదావరి జిల్లా గోపాలపురంలో వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్నదని తెలి పారు. తన భర్త చనిపోయారని తన కుమార్తె వలంటీర్‌గా పనిచేస్తూ చూసు కుంటుందన్నారు. ఇటీవల రాజీనామా చేయడంతో ఉద్యోగం లేక జంగా రెడ్డిగూడెంలోని తన ఇంటి దగ్గర ఉంటున్నదని తెలిపారు. ఆర్థిక ఇబ్బం దులతో తన కుమార్తె మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నట్లు తెలిపారు. తన కుమార్తెకు తిరిగి వలంటీర్ ఉద్యోగం ఇప్పించి ఆదు కోవాలని ఆమె కోరింది. ఈ ఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని స్థానిక ఎస్సై జ్యోతి బాసు తెలిపారు.

వృద్ధురాలి శరీరదానం

వైద్య కళాశాలకు అప్పగించిన కుటుంబ సభ్యులు



భీమవరం క్రైం, జూన్ 24 : మరణం అన్నది ప్రతీ ఒక్కరికి సహజం.. కానీ పదేళ్ల క్రితమే తమ మరణానంతరం పార్థివ దేహాలను వైద్య కళాశాలకు ఇవ్వాలని తలచారు భీమవరానికి చెందిన ఇద్దరు వృద్ధ దంపతులు. భీమవరం గునుపూడికి చెందిన గుబ్బల ప్రభావతి (83) ఆదివారం వృద్ధాప్యంతో కన్నుమూశారు. అయితే తన మరణానంతరం తన పార్థివ దేహాన్ని రాజమండ్రి వైద్య కళాశాలకు అందజేయాలని ఆమె అంగీకార పత్రం రాసి ఇచ్చారు. అయితే ఆమె కోరిక మేరకు ఆమె భర్త గుబ్బల సత్యనారాయణ మూర్తి, కుమారులు రమేష్‌బాబు, ప్రసాద్‌లు జీఎస్ఎల్ మెడికల్ కాలేజీకి ప్రభావతి మృతదేహాన్ని అందజేశారు. కళాశాలలోని మెడికోలు, ఇతర సిబ్బంది కలిసి గౌరవవందనం సమర్పించి అనంతరం అనాటమీ డిపార్ట్‌మెంట్‌కు ఆమె మృతదేహాన్ని స్వీకరించారు. వైద్య పరిశోధనలు నిమిత్తం ప్రతీఒక్కరూ శరీర, అవయవ దానాన్ని ప్రోత్సహించాలని ప్రభావతి కుటుంబ సభ్యులు కోరారు.

సారా విక్రయం, మోటారు సైకిళ్ల దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్

టి.నరసాపురం, జూన్ 24: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు.మక్కినవారిగూడెం పంచాయతీలోని గౌరీశంకరపురం గ్రామానికి చెందిన మొల్లేటి రాంబాబు సారా తయారు చేసి విక్రయించడంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో జరిగే జాతరలలో మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారంతో తన సిబ్బందితో సోమవారం దాడిచేసి రాంబాబును అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 20 లీటర్ల సారా,26 మోటార్ సైకిళ్లను స్వాధీన పరుచుకుని చింతలపూడి కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



మంత్రి లోకేశ్‌కు బొకే అందించిన మాజీ ఎమ్మెల్సీ అంగర

మంత్రి లోకేశ్‌కు అభినందన

పాలకొల్లు అర్బన్, జూన్ 24 : రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను సోమవారం కలిసి బొకే అందించినట్లు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమో హన్ తెలిపారు. అదే విధంగా మరో మంత్రి కొల్లు రవీంద్రను ఆయన ఛాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపినట్లు అంగర ఫోన్‌లో తెలిపారు.

ఉండి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణ రాజు(పాందువ్వ శ్రీను) మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో అభినందనలు తెలిపారు. అనంతరం మంత్రి లోకేశ్‌బాబును కూడా కలుసుకున్నారు.



టెన్త్‌లో ప్రతిభావంతులకు కాపు క్లబ్ సత్కారం

వీరవాసరం, (భీమవరం టౌన్) జూన్ 24 : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కాపు క్లబ్ వీరవాసరం శాఖ సత్కరించింది. వీరవాసరంలోని జేపీ ఫౌండేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. వీరవాసరం మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ జడ్పీ హైస్కూళ్లలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సన్మానించింది. ఈ విద్యార్థులకు నేషనల్ ఫ్లాగ్ టవర్ తరపున వడ్డి సుబ్బారావు తాపీ చెక్కిన శిల్పం పుస్తకాన్ని అందజేశారు. యునైటెడ్ కాపు క్లబ్ మండల శాఖ అధ్యక్షుడు గుండా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కాపు క్లబ్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, యునైటెడ్ కాపు క్లబ్ ప్రతినిధులు పెరవల్లి దుర్గ భవాని చంద్రశేఖర్, అడ్డాల రామచంద్రరావు కొల్లిపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రైల్వే అధికారులకు అందించే వినతిపత్రాలతో నాయకులు

రైళ్ల రద్దుతో ప్రత్యామ్నాయం చూపాలి

భీమవరం టౌన్, జూన్ 24 : తాత్కాలికంగా రద్దు చేసిన రైళ్ల స్థానంలో ప్రత్యామ్నాయ రైళ్లను వేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో ప్రజా సంఘాల నాయకులు సోమవారం సమావేశమయ్యారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు ఫ్యాక్స్‌ద్వారా వినతి పత్రాన్ని అందించాలని తీర్మానించారు. ఛాంబర్ కార్యదర్శి కాగిత వెంకట రమణ, బిల్డర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గన్నాబత్తుల శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ సీనియర్ నాయకులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రస్తుతం మన ప్రాంతాలకు ఉన్న రైళ్ల సరిపోక సతమతమవుతున్నామని, రైల్వే ట్రాక్స్ నిర్మాణంలో రైళ్ల మళ్లింపుతో రద్దు చేయడం ద్వారా నరసాపురం - రాజమండ్రి - నిడదవోలు - విజయవాడలకు వెళ్లివారికి ఇబ్బంది కరమని, వేరే ప్రత్యామ్నాయ మార్గాలను చూపాలని అన్నారు.

మొగల్తూరులో ఎమ్మెల్యే నాయకర్‌కు సన్మానం



మొగల్తూరు, జూన్ 24: శాసనసభ్యునిగా గెలుపొంది తొలి సారి సోమవారం మొగల్తూరు వచ్చిన నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు ఘన స్వాగతం లభించింది. మొగల్తూరు లాకు వద్ద వినాయకుడు ఆలయంలో జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండలు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులు నాయకర్‌ను సన్మానించారు. మొగల్తూరు రామాలయం సెంటర్‌లో జనసేన నాయకులు ముక్కు పుల్లయ్య నాయుడు, దొంగ స్వామి, చింతన్న, ముక్కు గిరి, గురుజు శ్రీను, దేశంశెట్టి శ్రీను, పోతురెడ్డి సూరిబాబు, గన్నాబత్తుల రామ్‌కుమార్ తదితరులు నాయకర్‌ను సన్మానించారు. ఈసందర్భంగా ఇరు పార్టీల నాయకులు మొగల్తూరు ప్రధాన కాలువలో పూడిక తొలగింపు చేపట్టి, కాలువ ప్రక్షాళన చేయాలని మొగల్తూరులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కాల్వల ప్రక్షాళన చేయండి

మొగల్తూరు, జూన్ 24: నియోజకవర్గంలో సాగునీటి కాలువల ప్రక్షాళన చేపట్టాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం మొగల్తూరులో ప్రధాన పంట కాలువ దుస్థితిని పరిశీలించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. శివారు ప్రాంతాలైన కెపి పాలెం, పేరుపాలెం, రామన్నపాలెం, మొగల్తూరులోని జంగిల్ చానల్‌లను ఆయన పరిశీలించి రైతులు, గ్రామస్థుల నుంచి వచ్చిన సమస్యలను పరిశీలించారు. రామన్నపాలెం సర్పంచ్ బందెల ఎలిజా, ఉప సర్పంచ్ మేకల ఆజా, యాతం పాండురంగారావు, మేడిద బాబ్జి, బస్వాని ఏడుకొండలు, కొప్పాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అమ్మవారి ఆశీస్సులుండాలి



భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జూలై 24: నియోజకవర్గ ప్రజలపై సంతోషి మాత ఆశీస్సులుండాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం 11వ వార్డులోని సంతోషిమాత ఆలయ ఆరో వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, హోమాలు జరిగాయి. అనంతరం నిర్వహించిన భారీ అన్న సమారాధనలో ఎమ్మెల్యే ఆరిమిల్లి భోజనాలు వడ్డించారు. టీడీపీ నాయకులు కలగర వెంకట కృష్ణ, తమరాపు రమణమ్మ, పల్లపరావు, పద్మనాభం, అల్లా శ్రీను, ఒమ్మి రాంబాబు, మద్దినపూడి రామకృష్ణ, తాతపూడి మారుతీరావు, తమరాపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

ఆకివీడు, జూన్ 24: పట్టణం, గ్రామాల్లోని కాలనీల్లో సమస్యలు పరిష్కరించేందుకు నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జేఎన్వీ గోపాలన్ అన్నారు. సోమవారం కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన పేద ప్రజలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు కొత్త ప్రభుత్వం బాటలు వేయాలన్నారు. మౌలిక వసతులు ఏర్పరచాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా రోడ్లు, మురుగు బోదెలు, మంచినీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్ర భుత్వ ఆసుపత్రుల లో సమస్యలు పరిష్కరించాలన్నారు.

చదువుతోనే భవిష్యత్: ఎమ్మెల్యే అంజిబాబు





కొవ్వాడలో విద్యార్థులకు కిట్లు పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే అంజిబాబు.. జిన్నూరులో జడ్పీటీసీ పెద్దిరాజు పంపిణీ

భీమవరం రూరల్, జూన్ 24 : చదువుతోనే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఏర్పడుతుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. సోమవారం కొవ్వాడ అన్నవరంలో విద్యాకిట్‌లు అందించారు. రాయలం, భీమవరం పీఎస్ఎం పాఠశాలలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు సీహెచ్ చంద్ర శేఖర్ అల్లూరి సుబ్రమణ్యంరాజు, అల్లూరి సాయిదుర్గరాజు, పేరిచర్ల రాంబాబు, కోళ్ళ అబ్బులు విద్యా కిట్‌లు పంపిణీ చేశారు.

పాలకొల్లు అర్బన్/ రూరల్: పట్టణంలోని బంగారు వారి చెరువుగట్టు వద్ద ఎస్‌కేపీ, టీవీఆర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు సోమవారం విద్యాసామగ్రి కిట్స్‌ను అందజేశారు. ముఖ్య అతిథిగా కమిషనర్ బి.విజయసారథి, ఎంఈవో జి.వీరా స్వామి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

- పాలకొల్లు రూరల్ మండలం లయన్స్ నగర్‌లోని ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, టై, బెల్టు, నోట్ పుస్తకాలను టీడీపీ నాయకులు అందించారు. మండల టీడీపీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, కార్యదర్శి పాముల రజనీ కుమారి, మాజీ సర్పంచ్ దొడ్డా శేషారత్నం, గ్రామ టీడీపీ అధ్యక్షుడు దొడ్డా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొగల్తూరు: మొగల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కానుక కిట్లను ఎమ్మెల్యే నాయకర్ పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు వర్ధమాన రవిశంకర్ సర్కార్ అధ్యక్షత వహించగా సర్పంచ్ పడవల మేరీ, జడ్పీటీసీ బాపూజీ, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, కొల్లాటి గోపి, నిప్పులేటి తారకరామారావు, లక్కు బాబి, రాంబాబు, మెట్ల రాంబాబు, ముక్కు గిరి పాల్గొన్నారు.

ఉండి: చెరుకువాడలోని పెదపేట మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా కిట్‌లు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం మంగతాయారు అధ్యక్షత వహించారు. ఎంపిటీసీ క్రిష్టాపర్, వార్డ్‌మెంబరు బిల్‌మోరియా, పార్టీ నాయకులు కట్టా రాంబాబు, యిర్రింకి బుజ్జి పాల్గొన్నారు.

పోడూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు అన్నారు. సోమవారం జిన్నూరు జడ్పీహైస్కూల్‌లో ఆయన విద్యాకిట్లను అందచేసి మాట్లాడారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, డీసీసీబీ మాజీడైరెక్టర్ దేవళ్ల ప్రసాదు, రాష్ట్ర టీడీపీ శెట్టిబలిజ సాధికారత డైరెక్టర్ గుబ్బల శ్రీరామ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉజ్వల భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని కోరారు. కార్యక్రమానికి సర్పంచ్ జమ్ము బేబీమహాలక్ష్మి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాలవలస తులసీరావు, యలకల శ్రీనివాసరావు, హెచ్ఎం సిహెచ్ శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం:

ప్రతి విద్యార్థి ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని టీడీపీ రేలంగి గ్రామ అధ్యక్షుడు మానే భాస్కరరావు అన్నారు. రేలంగి జడ్పీ హైస్కూలులో సోమవారం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం టి. రవీంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అత్తిలి: ప్రభుత్వం కల్పించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నాయకుడు రాజ్‌కుమార్ అన్నారు. కేవీస్ గట్టు గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్లను అందజేశారు. టీడీపీ నాయకులు గుడాల కాంతారావు, గుడాల సత్తిబాబు, శ్రీను, దుర్గారావు, కడలి సుశీల, ఉడతల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రామానాయుడుకు వేదాశీర్వాదం



పాలకొల్లు అర్బన్, జూన్ 24 : రాష్ట్ర జలవనరుల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నిమ్మల రామా నాయుడును నియోజక వర్గ బ్రాహ్మణ ఐక్య వేదిక నాయకులు కలిసి శాలువాలతో సత్కరించి, వేదాశీర్వాదం గావించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సాధికార సమితి నియోజక వర్గ కన్వీనర్, పట్టణ టీడీపీ మహిళా ప్రధాన కార్యదర్శి పెండ్యాల భవానీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీలు, గ్యాస్ స్టౌ అందజేత

పాలకొల్లు అర్బన్, జూన్ 24 : స్థానిక వీవర్స్ కాలనీలోని జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు దాతలు గ్యాస్ స్టౌవ్, కుర్చీలను అందించారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో దాతలు గాదె సుబ్బారావు, మజ్జి శంకరంలు పాఠశాలకు ఉపయోగ పడే వస్తువులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ధనాని సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పత్సమట్ల పూజలు



ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును స్వాగతిస్తున్న ఆలయ అధికారులు

గణపవరం, జూన్ 24: అర్ధవరం, గణపవ రం గ్రామాల్లోని దేవాలయాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధవరంలో ఈవో వై.శ్రీధ ర్, సిబ్బంది, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇందుకూరి గుర్రాజు (కృష్ణంరాజు), అద్దేపల్లి వాసురాజు, కూనంపూడి సురేంద్రకుమార్‌రాజు,కాపారం చిన్న, తోట శ్రీనివాసరావు, గంటా అన్నవరం పాల్గొన్నారు.

గుప్తకు మాతృవియోగం

పాలకొల్లు అర్బన్, జూన్ 24 : పట్టణ బీజేపీ కోశాధికారి కొణిజేటి గుప్త మాతృమూర్తి కళావతి (65) సోమవారం సాయంత్రం మరణించారు. అనారోగ్యంతో ఇంటిలోనే మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్, కార్యదర్శి కె కొండ ప్రసాద్, మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు

సమస్యలపై ఫిర్యాదులు

పెనుగొండ/ఆచంట/ఆకివీడు/పాలకొల్లు అర్బన్, జూన్ 24: తహసీల్దార్ కార్యాలయంలోనూ, మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో జరిగి కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందాయి. ఆచంట తహసీల్దార్ కార్యాలయంలోనూ, మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. ఆకివీడులో జరిగిన కార్యక్రమంలో ఒక ఫిర్యాదు అందింది. పాలకొల్లులో ఒక ఫిర్యాదు మాత్రమే వచ్చినట్లు కమిషనర్ బి.విజయ సారథి తెలిపారు. సాంకేతిక సమస్య వల్ల మండ ల కార్యాలయంలో నిర్వహించే ఈకార్యక్రమాన్ని కూడా మున్సిపల్ కార్యాలయంలోనే నిర్వహించారు.

అంబేడ్కర్ విదేశీ విద్య కొనసాగింపు అభినందనీయం

ఆచంట, జూన్ 24: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా అంబేడ్కర్ విదేశీ విద్య యోజన పథకాన్ని కొనసాగించడంతోపాటు గత ప్రభుత్వంలో ఉన్న జగనన్న విదేశీ విద్య పేరు మార్చడాన్ని రాష్ట్రంలోని దళితులందరూ అభినందిస్తున్నట్లు టీడీపీ యువనాయకులు సిర్రా బాలాజీ అన్నారు. 2015లో ఏర్పడిన అంబేడ్కర్ విదేశీ యోజన పథకాన్ని రాష్ట్రాల పరిధిలో బలహీనవర్గాల చదువుకు ఎంతగానో ఉపయోగపడిన ఈ పథకం పేరు మార్చి వందల కోట్ల రూపాయలు పక్కదోవ పట్టించిన జగన్మోహనరెడ్డి దళిత విద్యార్థులకు తీరని అన్యాయం చేశారని బాలాజీ పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజులకే దళితుల ఆత్మగౌరవం నిలబెట్టే దిశగా అంబేడ్కర్ విదేశీ విద్య పేరుగా మార్చడం ఆనందంగా ఉందన్నారు.

తాగునీరు అందించండి: సీపీఎం

పెనుగొండ, జూన్ 24: 2008లో ఏర్పడిన పెనుగొండ గ్రామం కోడిపందాల దిబ్బ ప్రాంతంలో 1130 కుటుంబాలకు ఇంటి స్థలాలు ఇవ్వగా వీరిలో 600 మంది ఇళ్లు నిర్మించుకుని నివశిస్తున్నారని అయితే వీరు తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నారని వెంటనే తాగునీరు అందించాలని సీపీఎం నాయకులు ఎస్. వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం కోడిపందాల దిబ్బ ప్రాంతంలో తాగునీటి సమస్య రోడ్ల సమస్య డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సచివాలయం 3లో సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు అసెంబ్లీ ఎన్నికల వరకు తాగునీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసేవారన్నారు. ఎన్నికల తరువాత మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస దొరకు తాగునీటి కోసం ఎన్ని సార్లు తెలిపినా నీళ్ళు పంపిస్తామని అంటారే తప్పఈ రోజు వరకు చుక్క నీరు అందజేయలేదన్నారు.

వేర్వేరు చోట్ల కట్నం కేసుల నమోదు

ఉండి, జూన్ 24:కట్నం కేసు నమోదైంది. ఎస్ఐ లక్ష్మణ్ అందించిన వివరాలు ఇవే. ఉండి పంచాయతీ పరిధిలోని రామాపురంనకు చెందిన సురేష్-ఝాన్సీలకు 2008లో వివాహమైంది. వీరికి పాప వుంది. ఇప్పుడు అధికకట్నం కావాలని తరుచు భర్త, అత్తమామలు వేధిస్తున్నారని ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

- ఉండి నక్కరాజుగుంటకు చెందిన వర్ధనపు ప్రభాకర్‌కు సునందీకు 2022లో వివాహమైంది, వీరికి పాప వుంది. ఇప్పుడు అధికకట్నం కావాలని భర్త ప్రభాకర్, అత్తమామలు వేధిస్తున్నారని భార్య సునందీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పూడిక పేరుతో దోపిడీ

మండల సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి ఆరోపణ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 24: మన పాలన ప్రజోపకరంగా ఉండాలి తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టేదిగా ఉండకూడదని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పథకంపై సమీక్షిస్తూ గతంలో లే అవుట్‌ల పూడిక పేరుతో ఎంత దోచుకున్నారో వివరాలివ్వాలని ఎమ్మెల్యే ఆదేశించగా రూ.6.50 కోట్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. హౌసింగ్ రివ్యూలో డీఈ ప్రసాద్ వివరిస్తుండగా మౌలిక సదుపాయాల కల్పన లేకుండా స్థలాలు ఇచ్చి ఏం లాభమని ప్రశ్నించారు. మాధవరంలో వైసీపీ నాయకులు రెండేసి స్థలాలు తీసుకుని అర్హులకు లేకుండా చేశారని స్థానికులు ఫిర్యాదు చేయగా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, ఎంపీడీవో శర్మ, తహసీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వర్షం నీటిని మళ్ళించేందుకు డ్రెయినేజీలో పూడికలు తీయిస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 24: వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షం కారణంగా తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి రోడ్డు మునిగిపోవడంతో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే బొలిశెట్టి దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే స్పందించిన ఆయన సోమవారం మున్సిపల్ అధికారులతో మాట్లాడి ఎక్స్‌కవేటర్‌తో డ్రైనేజీల్లో పూడిక తొలగించి సమస్య పరిష్కరించారు.

భక్తాంజనేయస్వామికి పూజలు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 24: యాగర్లపల్లి భక్తాంజనేయస్వామి వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే బొలిశెట్టి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనను సత్కరించింది. జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 24: విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసి విద్యార్థుల జీవితాలతో జగన్ ఆడుకున్నాడని ఎమ్మెల్యే బొలిశెట్టి అన్నారు. తాడేపల్లిగూడెం జడ్పీ హైస్కూలులో స్టూడెంట్స్ కిట్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాడు-నేడు పేరుతో కోట్ల రూపాయల అవినీతి దందా చేశారని, విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం అంటూ ఆర్భాటం చేసిన జగన్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వకుండా విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారన్నారు.

చీరల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 24: తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో పేద మహిళలకు సోమవారం వట్టిప్రోలు రామకృష్ణారావు సహకారంతో చీరల పంపిణీ జరిగింది. క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామ్మోహనరావు, కార్యదర్శి చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస దొర

పెనుగొండ, జూన్ 24: ప్రస్తుత వాతావరణంలో వస్తున్న మార్పులు కారణంగా అంటు వ్యాధులు ప్రజలే అవకాశం ఉన్నందున అధికారులందరూ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాస దొర అన్నారు. సోమవారం పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, సెక్రటరీలు, ఏఎస్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ అవసరాలకు సరఫరా చేసే తాగు నీరు శుభ్రంగా ఉండాలన్నారు. ప్రతీ రోజూ క్లోరినేషన్ చేసిన తరువాతనే ప్రజలకు సరఫరా చేయాలన్నారు. అంటువ్యాధులు ప్రబల కుండా గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ప్రజల వద్దకే నాయకులు



కొడమంచిలిలో ప్రజల వద్ద నుంచి సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న కూటమి శ్రేణులు

ఆచంట, జూన్ 24: కొడమంచిలిలో ప్రజల వద్దకే నాయకులు అనే రచ్చబండ కార్యక్రమం సోమవారం కూటమి శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 14 వార్డుల్లో సమస్యలు తెలుసుకుని వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సమస్యలను ఎమ్మెల్యే పితాని దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు.

27న మావుళ్ళమ్మ జ్యేష్ఠమాస జాతర

భీమవరం టౌన్, జూన్ 24 : ఈనెల 27న మావుళ్ళమ్మ జ్యేష్ఠమాస జాతరను మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభిస్తారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. గరగల నృత్యం, బేతాళ శక్తి వేషాలు, మ్యూజికల్ ఫుల్ బ్యాండ్, బుట్టబొమ్మల ప్రదర్శన, కోలాట భజన ఉంటాయి.

28న కౌన్సిల్ సమావేశం

నరసాపురం టౌన్, జూన్ 24: పురపాలక సంఘ కార్యాలయంలో ఈనెల 28న కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఛైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన మధ్యాహ్నం 3గంటలకు జరిగే ఈసమావేశంలో పలు అంశాలను సభ్యులు చర్చిస్తారన్నారు.

ఆ నాలుగు పదవులపైనే అందరి చూపు



నరసాపురం, జూన్ 24: అధికారంలోకి ఎన్డీఏ కూటమి రావడంతో పార్టీ శ్రేణుల దృష్టి కీలకమైన పదవులపై పడ్డాయి. వాటిని దక్కించుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వాళ్లు మొదలుపెట్టారు. గత ఐదేళ్లు తాము పడిన కష్టం, చేసిన పోరాటాలు, పార్టీ పట్ల విధేయత, సామాజిక వర్గాలను పరిగణలోకి తీసుకుని తమకు కీలకమైన పదవి ఇవ్వాలని ఇప్పటి నుంచే కొందరు అధినేతపై ఒత్తిడి మొదలుపెట్టారు. కూటమిలో టీడీపీ, జనసేన, బీజేపీలు ఉండటంతో ఈపార్టీల్లోనూ ముఖ్య నాయకులంతా కీలకమైన ఏఎంసీ, అర్బన్‌బ్యాంకు, ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ పదవులతో పాటు ఏఎంసీ ఉపాధ్యక్ష పదవుల్ని ఆశిస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో కీలకమైన పదవి ఏఎంసీ ఛైర్మన్, ప్రస్తుతం జనసేన ఎమ్మెల్యే స్థానంలో ఉండటంతో మిగిలిన పార్టీలు ఆ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇక అర్బన్ బ్యాంకు ఛైర్మన్ గిరిని పార్టీల్లోనూ ముఖ్య నేతలు ఆశిస్తున్నారు. ఇటు ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ పదవులపై కూడా ఎక్కువ మంది ఆశపడుతున్నారు. ఇప్పటికే వీటి కోసం ఎవరి వంతు ప్రయత్నాలు వారు మొదలుపెట్టారు. అయితే ఈ నాలుగింటిలో ఎక్కువ పోటీ ఏఎంసీ ఛైర్మన్, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ పదవులపైనే ఉంది. దీంతో ఎవరికీ ఈ పదవులు వరిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

చేపల పట్టుబడికి వేలం పూర్తి

ఆకివీడు, జూన్ 24: భుజబలరాయుడు మంచినీటి చెరువు, భుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంకులలో ఒకరోజు చేపలు పట్టుబడికి సోమవారం నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాటలు మేనేజర్ వెంకటేశ్వరరావు నిర్వహించారు. చెరువును వల్లభుని నాగరాజు రూ.28 వేలకు, స్టోరేజ్ ట్యాంకును వనమాలి కృష్ణ భగవాన్ రూ.40వేలకు పాడుకున్నారు. ఈ నెల 29,30వ తేదీలలో పట్టుబడి పట్టుకుంటారని అధికారులు తెలిపారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి



రైతు సంఘం నాయకుడు కలిదిండి గోపాల కృష్ణంరాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం టౌన్, జూన్ 24 : వృద్ధుల సమస్యలను కొత్తగా అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వినతి పత్రం ద్వారా తీసుకెళ్ళాలని సీనియర్స్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ ప్రతినిధులు నిర్ణయించారు. సోమవారం నాడు పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక కేంద్రంలో జిగిన సొసైటీ సమావేశానికి అధ్యక్షుడు నల్లం వెంకట కృష్ణనాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. సొసైటీ ఏర్పాటు చేసి పది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అక్టోబర్‌లో దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ నాయకులు కలిదిండి గోపాలకృష్ణంరాజు, చెన్నంశెట్టి గణపతిరావులను సత్కరించారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి బోనం పాండురంగారావు, మట్లపూడి సత్యనారాయణ, వడ్డినర్సయ్య, సయ్యద్ బాజీ, పెన్మెత్స రామకృష్ణంరాజు, వినుకొండ పాండురంగారావు, చీమకుర్తి నరసింహరావు, జీఎస్ఎన్‌రాజు, అప్పలరాజు, పాండురంగ, పావిరాల సత్యనారాయణ, సాగి సత్యనారాయణ, శేషాద్రిశ్రీనివాస్, కడియం శ్రీనివాస్, ఉండపల్లి సత్యనారాయణ, ఉండపల్లి శేషగిరిరావు, తాళ్ళపూడి గాంధీ పాల్గొన్నారు.

దోమలు నివారించాలి

తణుకు, జూలై 24: దోమలు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సబ్ యూనిట్ అధికారి జి. వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని నాగేంద్రనగర్ ప్రాంతంలో మలేరియాపై అవగాహన కల్పించారు. దోమల పుట్టుకకు నిలయమైన మురుగునీరు లేకుండా చూడాలని, నీరు సక్రమంగా పారితే దోమలు వ్యాప్తి ఉండదన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా అన్నక్యాంటీన్ భవనం



గణపవరం, జూన్ 24: గణపవరంలో అసంపూర్తిగా నిలిచి వున్న అన్నక్యాంటీన్ భవనం పూర్తి చేసి పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం చంద్రబాబునాయుడు హామీ మేరకు అన్నక్యాంటీన్ల పునరుద్ధరణ చేస్తున్నందున గణవపంలో 2019 ఫిబ్రవరి 14న అన్నక్యాంటీన్‌కు శంకుస్థాపన జరిగింది. రూ.40లక్షల అంచనాలతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. జగన్ ప్రభుత్వం రావడంతో అన్నాక్యాంటీన్లు మూసివేశారు. అసంపూర్తిగా మిగిలిపోయిన భవనం ఐదేళ్లుగా నిరుపయోగంగా మారింది. కూటమి ప్రభుత్వం రాకతో అన్నాక్యాంటీన్ భవనానికి మోక్షం లభించనుంది. ప్రస్తుత ప్రభుత్వం నిరుపయోగంగా ఉన్న అన్నాక్యాంటీన్ల నిర్వహణకు చర్యలు చేపట్టాలని పేదల ఆకలి తీర్చేందుకు చర్యలు చేపట్టాలి పలువురు కోరుతున్నారు.

ఇస్రో శాస్త్రవేత్తల కృషిని స్ఫూర్తిగా తీసుకోవాలి

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 24 : ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగాలే కాదు అంతరిక్షంలో ఉన్న వ్యర్థాలను కూడా పర్యావరణానికి హాని జరగకుండా క్రిందకి దించే విధంగా రూపొందించిన పుష్పక్ ప్రపంచంలో ఇదే ప్రథమం కావడం భారత శాస్త్రవేత్తల దేశభక్తికి తార్కాణమని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు అన్నారు. ఇస్రో ఆధ్వర్యంలో (రీయాజబుల్ లాంచ్ వేహికల్) పుష్పక్ విజయవంతంగా ప్రయోగించిన సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల జన విజ్ఞాన వేదిక, ఎస్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ప్రధానంగా ఇంజనీరింగ్ విద్యార్థులు ఇటువంటి ప్రయోగాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి భవిష్యత్‌లో తాము కూడా శాస్త్ర సాంకేతిక రంగాలలో నైపుణ్యం సాధించే విధంగా లక్ష్య సాధనతో విజయాలు సాధించాలని ఆయన సూచించారు. శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భారత దేశం గర్వించదగ్గ రీతిలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్రమంలో ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఆర్ కృష్ణచైతన్య, సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డా.ఎం గణేష్, శ్రీవిజ్ఞాన వేదికకు చెందిన కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

